నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | NALGONDA

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చర్యలు

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల నియమావళిని యంత్రాంగం పటిష్టంగా అమలు చేస్తున్నదని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పౌరులు బాధ్యతగా నడుచుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా మానిటరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఇతర వ్యక్తులు, రాజకీయ పార్టీలను ఉద్దేశించి సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ తదితర వాటిల్లో అనుచిత వ్యాఖ్యలు, పోస్టింగులు పెడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు సీజ్ చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో అన్నీ కష్టాలే..

నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం చేసిండ్రు

మళ్లీ ఈ రాష్ట్రం అభివృద్ధి కావాలంటే కేసీఆరే శరణ్యం

సీఎం బూట్లు తుడిచేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ పోటీ పడుతుండ్రు

నల్లగొండలో రెండు ఎంపీ సీట్లు గెలిపించి కాంగ్రెస్ నుంచి విముక్తి చేస్తాం

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



నల్లగొండలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలో పాల్గొని నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, తిప్పన తదితరులు

నల్లగొండ, ఏప్రిల్ 27 : 14 సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణను సాధించిన కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని పదేండ్ల అధికారంలో అద్భుతంగా తీర్చిదిద్దితే కాంగ్రెస్ సర్కార్ వచ్చి నాలుగు నెలల్లో సర్వనాశనం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నల్లగొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ కారులు, బీఆర్ఎస్ సేనకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు బీఆర్ఎస్ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఎగురవేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం మరోసారి ఉద్యమం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. మన నీళ్లు, నిధులు, నియామకాలు మనకే ఉండాలని కేసీఆర్ ఉద్యమం చేస్తున్న సందర్భంలో ఆయన వల్ల ఏమయితదని అందరూ అనుకున్నారని, కానీ చావునే జయించి ఈ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిగా కేసీఆర్ చరిత్రలో నిలిచారని తెలిపారు. సీఎంగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని చెప్పారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు లేని తెలంగాణగా మార్చి వ్యవసాయ రంగాన్ని సస్యశ్యామలం చేశారని తెలిపారు. మూడు లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే విధంగా నల్లగొండను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నల్లగొండ జిల్లా ప్రజలు కేసీఆర్ రుణం తీర్చుకోవాలని ఆరాట పడుతున్నారని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు ఎంపీ సీట్లు గెలిపించి కేసీఆర్‌కు బహుమతి ఇస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటే కేసీఆర్ రావాల్సిందేనని, లేదంటే ఈ రాష్ట్రం ఆగమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలతో కాంగ్రెస్ నుంచి నల్లగొండ జిల్లాకు విముక్తి కల్పిస్తామని తెలిపారు.

ఏ పద్ధతిలో రాజీనామా కావాలో అలాగే ఇస్తాం..

పండ్రాగస్టులోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తే హరీశ్‌రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారని, సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డికి ఏ పద్ధతిలో రాజీనామా కావాలో చెప్తే అదే పద్ధతిలో అందజేస్తామని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చిల్లర మాటలు ప్రజలకు తెలుసని, ఆయన ఎప్పుడూ ఒకే మాటపై ఉండరని విమర్శించారు. రేవంత్ రెడ్డికి పీసీసీ ఇస్తే గాంధీ భవన్‌ను తొక్కనని అన్న కోమటిరెడ్డి ఇయ్యాల సీఎం బూట్లు తుడిచేందుకు అన్న దమ్ములు ఎందుకు పోటీ పడుతున్నారని ప్రశ్నించారు.

జిల్లా అధ్యక్షుడిగా హోదాను స్వీకరించిన రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్‌ను కేసీఆర్ గతంలోనే నియమించినప్పటికీ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్మాణం పూర్తి స్థాయిలో కాలేదు. ఇటీవల అది పూర్తి కావడంతో శనివారం ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షుడి హోదాను స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటి రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాంచందర్ నాయక్, నాయకులు తిప్పన విజయసింహా రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, పంకజ్ యాదవ్, బక్క పిచ్చయ్య, బకరం వెంకన్న, మైనం శ్రీనివాస్, నిరంజన్ వలీ, కరీం పాషా, రావుల శ్రీనివాస్ రెడ్డి, జయప్రద, స్వరూప పాల్గొన్నారు.

పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా రమావత్ రవీంద్రకుమార్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి, భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, తిప్పన తదితరులు

నల్లగొండ జిల్లా కోర్టులో నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, బి.విజయసేన్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు తదితరులు

నల్లగొండలో అట్టహాసంగా కోర్టు భవనాల ప్రారంభం

- హాజరైన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే..
- హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయ్ సేన్‌రెడ్డి
- వందశాతం కేసుల పరిష్కారంతో ముందుగు సాగాలి : అలోక్ అరాధే
- స్ఫూర్తి నింపేలా ప్రసంగించిన హైకోర్టు న్యాయమూర్తులు

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన

రామగిరి, ఏప్రిల్ 27 : నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో నూతన టెక్నాలజీతో నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయం ప్రారంభోత్సవం శనివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు టి.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, బి.విజయసేన్ రెడ్డికి నల్లగొండ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. మంగవాయిద్యాలతోపాటు పోలీసుల గౌవర వందనం చేశారు. అనంతరం రెండు అంతస్తులతో నూతన టెక్నాలజీతో నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయాన్ని వారు ప్రారంభించారు. రెండు అంతస్తుల్లో ఏర్పాటు చేసిన కోర్టులు, సమావేశ మందిరం తదితర వాటిని తిరిగి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే మాట్లాడుతూ వందశాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తూ ముందుకు సాగుతున్నదన్నారు. ఆ దిశగా కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ టెక్నాలజీని అందిస్తున్నామని స్పష్టం చేశారు. నల్లగొండలో నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల ఆధునిక భవనంలో డిజిటలైజేషన్‌తోపాటు అన్ని రకాల మౌలిక సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ముఖ్యంగా లైబ్రరీ, రిక్రీయేషన్ వంటి అన్ని సౌకరాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కోర్టులను డిజిటలైజేషన్ చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టులో అత్యధిక కేసులు పరిష్కారం అవుతున్నాయని, ఆ దిశగా బార్ అండ్ బెంచ్ సహకారం ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయాధికారులు, న్యాయవాదులు ఎప్పటికప్పుడు సామర్థ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టలపై అవగాహన పెంచుకోవడంతోనే వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. తెలంగాణలో 8,500పెండింగ్ కేసులు పరిష్కారమయ్యాయని, నల్లగొండ జిల్లాలో కూడా వంద శాతం కేసులు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. ఇకపై కోర్టుల సముదాయంలో నల్లగొండ జిల్లా కోర్టులో కేసులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే అవకాశం ఉందని అన్నారు. న ల్లగొండ బార్ అసోసియేషన్ అండ్ బెంచ్ సమన్వయంతో పనిచేస్తూ న్యాయం కోసం వచ్చే ప్రజలకు సహకరించాలని కోరారు. నల్లగొండలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు ప్రారంభ ఉపన్యాసం చేసి మాట్లాడారు. జిల్లా కోర్టు చరిత కోర్టులో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి, జిల్లా కోర్టులోని వివిధ కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛాలు అందజేత..

నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తులకు కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, ఏఎస్పీ రాములునాయక్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సమావేశం ముగింపులో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, సీనియర్ న్యాయవాదులు, డిఫెన్స్ న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ అధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు కూడా వారికి పుష్పగుచ్ఛాలతోపాటు జ్ఞాపికలు అందించారు.

బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణకు శ్రీరామ రక్ష

- కేసీఆర్‌తోనే సబ్బండ వర్గాల సమాన అభివృద్ధి
- బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల
- సూర్యాపేటలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సూర్యాపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గులాబీ జెండా ఎగుర వేస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్, ఎప్రిల్ 27 : నాటి ఉద్యమ రథ సారథిగా 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదేండ్ల పాలనలో యావత్ దేశానికే రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిపారని, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం సూర్యాపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన గులాబీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సబ్బండ వర్గాల సమాన అభివృద్ధి జరిగిందన్నారు. గత పదేండ్లు ప్రజలంతా అన్ని రంగాల అభివృద్ధితో ఐక్యతను పెంచుకుంటూ సుఖ సంతోషాలతో జీవించారని గుర్తు చేశారు. అంతకు మించి అభివృద్ధి, సంక్షేమాలు అందిస్తామన్న కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, కానీ అతి తక్కువ సమయంలోనే మోసపోయామని తెలుసుకున్నారని తెలిపారు. అధికారం చేపట్టిన అతి తక్కువ సమయంలో ప్రజల్లో ఇంతటి వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని స్థాపించి, ఎన్నో అభివృద్ధి పనులతో ప్రజల కలను సాకారం చేసిన కేసీఆర్ చరిత్రలో నిలిచి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ జీడి భిక్షం, కౌన్సిలర్లు బాషా, తాహేర్ పాషాతో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మన అభ్యర్థులను గెలిపించుకోవాలి

గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. 24 ఏండ్ల బీఆర్ఎస్ చరిత్రలో 14 ఏండ్లు పోరాటం చేసి, పదేండ్ల అధికారంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, ఈ రాష్ట్ర భవిష్యత్ కోసం ఎంతో పోరాటం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో అబద్ధాల ప్రచారంతో అధికారంలోకి వచ్చి ఈ నాలుగు నెలల్లో హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి ఆ పార్టీ నాయకులు ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూస్తూ మాట్లాడుతున్నట్లు చెప్పారు.

–బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్



నూతన కోర్టులో కంప్యూటర్ విభాగాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే

మిర్యాలగూడ కాంగ్రెస్‌లో చేరికల లొల్లి

- మున్సిపల్ చైర్మన్‌తోపాటు పలువురు కౌన్సిలర్ల చేరికపై ఆ పార్టీలో ఆగ్రహం
- డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా హైదరాబాద్‌లో చేరిక
- స్థానికంగా వ్యతిరేకతతో చేరికను రద్దు చేసిన పార్టీ అధిష్టానం

తిరునగరు భార్గవ్, అతని అనుచరులు కాంగ్రెస్‌లో చేరికలపై ఏర్పాటైన ఫ్లెక్సీపై పేడ కొడుతున్న మహిళలు

మిర్యాలగూడ, ఏప్రిల్ 27 : మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీలో నూతనంగా బీఆర్ఎస్ నుంచి చేరిన నాయకులపై హస్తం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తోపాటు మరో 12 మంది కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, స్థానిక నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. చేరికలపై అధిష్టానాన్ని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుల అనుమతి లేకుండా ఎలా చేర్చుకుంటారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డ తిరునగరు భార్గవ్, అతని అనుచరులను ఎలా చేర్చుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తల కారణంగానే అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ వచ్చిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తిరునగరు భార్గవ్, అతని అనుచరుల అవసరం ఏముందని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వచ్చి పదవులు అనుభవించడం, దోచుకోవడం, అనుచరులకు దోచిపెట్టడం వారి నైజం అని ఆరోపించారు.

ఉదయం చేరికలు.. మధ్యాహ్నం రద్దు

మిర్యాలగూడ ఎమ్మెల్యేగా బత్తుల లక్ష్మారెడ్డి గెలిచినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ కావాలని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలాసార్లు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుమతితోనే పార్టీలో చేర్చుకోవాలని అధిష్టానం చెప్పడంతో రెండు నెలలుగా తర్జనభర్జన పడుతున్నారు. ఇటీవల ఓ కాంగ్రెస్ నాయకుడి అండతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షికి సమాచారం అందించిన మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌తోపాటు మరో 12 మంది కౌన్సిలర్లు పార్టీలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నారు. శనివారం హుటాహుటిన భార్గవ్ అతని అనుచరులు గాంధీభవన్‌కు చేరుకున్నారు. దీపాదాస్ మున్షి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితోపాటు డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. అందరూ భార్గవ్‌ను పార్టీలోకి తీసుకోవద్దని ఏకగ్రీవ తీర్మానం చేశారు. వారు రావడం వల్ల పార్టీ బలోపేతం కావడమేమోగానీ, పార్టీలో కుమ్ములాటలు ఉంటాయని తెలిపారు. కాగా డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే అనుమతి లేకుండా చేరికలు చెల్లుబాటు కావని, భార్గవ్ అతని అనుచరుల చేరికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ మిర్యాలగూడ ఎమ్మెల్యేకు ఫ్యాక్స్‌లో ఒక లెటర్‌ను పంపించారు.

ఫ్లెక్సీలతో నిరసన

తిరునగరు భార్గవ్, అతని అనుచరులు ఇంతకాలం గుంటనక్కల్లాగా దోచుకుతిన్నారని, అభివృద్ధి చేయకుండా వ్యక్తిగత సంపాదనలు చేసుకున్నారని ఆరోపిస్తూ పలు వార్డుల్లో ఫ్లెక్సీలు వెలిశాయి. ఫ్లెక్సీలకు చెప్పులు కట్టారు. కొంతమంది మహిళలు ఫ్లెక్సీలను చెప్పులు, పేడతో కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చేరికలు మిర్యాలగూడ కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మాట్లాడుతున్న కురుమ సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహులు

క్యామ మల్లేశ్ గెలుపు కోసం గొల్లకురుమలు ఏకం కావాలి

- కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహులు
- బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

యాదగిరిగుట్ట, ఏప్రిల్27 : రాజకీయ పార్టీలకతీతంగా గొల్లకురుమలు ఏకమై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపునకు కృషి చేయాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు గవ్వల నర్సింహులు పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని కురుమ సంఘం భవనంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. క్యామ మల్లేశ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలేవైనా గొల్లకురుమ అభ్యర్థి గెలుపుకోసం పార్టీలకతీతకంగా గొల్ల కురుమలు ఐక్యత ప్రదర్శించారని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు గెలిపించుకోవాలని కోరారు. ఎక్కడికక్కడ ప్రతి గొల్లకురుమ సంఘటితమై కారు గుర్తుకు ఓటేసే విధంగా చూడాలన్నారు. గొల్లకురుమల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించాలంటే క్యామ మల్లేశ్ గెలిచితీరాల్సిందేనని చెప్పారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గొల్లకురుమలకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన ఆయోధ్యయాదవ్, కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డోకే బాలకృష్ణ, యాదవ సంఘం జిల్లా నాయకులు గంగుల శ్రీనివాస్, గొల్లకురుమ సంఘం జిల్లా నాయకులు కోరె భిక్షపతి, గొర్ల పెంపకందారుల జిల్లా డైరెక్టర్ జల్లి నర్సింహులు, నాయకులు శ్రీనివాస్ యాదవ్, పసుల బాలయ్య యాదవ్, ఆకుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ పట్టణంలోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలి

- నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్

నల్లగొండ/మిర్యాలగూడ/మాడ్గులపల్లి, ఏప్రిల్ 27 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు తమ విధులను పారదర్శకంగా నిర్వహించాలని నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. మిర్యాలగూడ, మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, తిప్పర్తి మండలాల్లో పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎన్నికల్లో వందశాతం పోలింగ్ జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. బీఎల్ఓలు సకాలంలో ఓటర్లకు ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలని చెప్పారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను, డీఆర్ఎస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జి.శ్రీనివాస్‌రావు, తాసీల్దార్లు తదితరులు ఉన్నారు.